
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 26 డిసెంబర్ 2022
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు






చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారు

ప్రజాశక్తి -కందుకూరు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కందుకూరు పర్యటన రెండు రోజులు సాగనుంది. ఈ మేరకు షెడ్యూల్ ఖారైంది. 28వ తేదీ ఉదయం 11గంటలకు విజయవాడ నుంచి చంద్రబాబు నాయుడు బయలుదేరుతారు. మధ్యాహ్నం 3 గంటలకు శింగరాయకొండ బైపాస్ రోడ్డు జక్షన్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్ షో సాగనుంది. 5 గంటలకు కందుకూరులోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభ 7 గంటలకు ముగుస్తుంది. రాత్రి 7.30గంటలకు అలా వారి కళ్యాణ మండపంలో బస చేస్తారు. 29 తేదీ ఉదయం 11 గంటలకు అక్కడే పొగాకు రైతులతో సమావేశం జరుగుతుంది. 2.30 గంటలకు కావలి పయనం అవుతారని టిడిపి నాయకులు తెలిపారు.



నారా చంద్రబాబునాయుడు, టిడిపి జాతీయ అధ్యక్షులు

పింఛన్... టెన్షన్..!

- 12,030 మందికి నోటీసులు
- జనవరి 5 వరకు వివరణకు గడువు
- కొత్త పింఛన్లు 12,600 మంజూరు
- జనవరి పింఛన్ ఎవరికీ ఆగదు - డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

పింఛన్ మంజూరు విషయంలో నిబంధనలు పాటించాలని లబ్ధిదారులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. మీకు పింఛన్ ఎందుకు నిలుపుదల చేయకూడదో చెప్పాలంటూ అధికారులు చెప్పడంతో ఒక్కసారిగా జిల్లా వ్యాపితంగా పింఛన్ దారుల్లో ఆందోళన నెలకొంది. జిల్లా వ్యాపితంగా 12,030 మందికి నోటీసులు జారీ చేశారు. జనవరి 5వ తేదిలోపు వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. లేని పక్షంలో పింఛన్ రద్దు చేయనున్నారు. ఒక్క నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోనే 4 వేల మందికి నోటీసులు జారీ చేశారు. కొత్తగా 12,600 మందికి పింఛన్లు పభుత్వం మంజూరుచేసింది. జనవరి నెల నుంచి ప్రస్తుతం రూ 2500 నుంచి రూ 2750కి పెరగనుంది. నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు ఎంఎల్ ఎలు, వైసిపి నేతల చుట్టూ తిరుగు తున్నారు. జనవరి నెలలో అందరికీ పింఛన్ ఇస్తామని, డిఆర్‌డిఎ పీడీ సాంబ శివారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ నిబంధనలతో కొందరు పింఛన్‌దారులు పింఛన్ కోల్పోతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి నుంచి ఈ నిబంధనలు అమలు జరుగు తున్నాయి. ఒక వైపు కొత్త పింఛన్లు ఇస్తూనే, మరో వైపు నిబంధనల పేరుతో పింఛన్లు తొలగిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 3.64 లక్షలమంది పింఛన్‌దారులున్నారు. ప్రస్తుతం 38 మండలాల పరిధిలో 3.04 లక్షల మంది ఉన్నారు. వృద్ధులు, వితంతువులు, ద్వివ్యాంగులు, చేనేత, గీత కార్మికులకు పింఛన్లు అందుతున్నాయి గత ప్రభుత్వం ప్రతి నెల రూ 2 వేలు పింఛన్ ఇస్తుండుగా ఎన్నికల సమయంలో పింఛన్ రూ 3 వేలకు పెంచారు. వైసిపి అధికారంలోకి వచ్చాక అంతే ఇస్తామని ప్రకటించినా , ఒక్కసారి పెంచకుండా ప్రతి ఏడాది రూ 250 పెంచుతున్నారు. ఇటీవల వరకు రూ 2,500 ఉండగా, ప్రస్తుతం దానిని రూ 27,50 పెంచారు. ఆదే సమయంలో పలు నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నారు. 300 యూనిట్ల గృహ విద్యుత్ పెరిగితే పింఛన్ కట్ చేస్తున్నారు. నాలుగు చక్రాల వాహనం ఉన్నా, ఇన్‌కమ్ టాక్స్ చెల్లిస్తున్నా, ఇంటి పన్ను భారీగా కడుతున్నా, కార్పొరేషన్ పరిధిలో వెయ్యి స్కోయర్ పీట్ భూమికి ఇంటి పన్ను చెల్లిస్తున్నా, కుటుంబం సభ్యులు ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా , పింఛన్ ఇవ్వరు. ఈ నిబంధనలు అమలు చేయడానికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తనిఖీ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈనెల 22వ తేదీన జిల్లా వ్యాపితగా 12,030 మందికి నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించకుండా, పింఛన్ పొందుతున్నారని, అందుకే పింఛన్ నిలుదుల పిలుపుదల చేస్తామని ఆ నోటీసులో ఉంది. ఒక వేళ తాము చెప్పిన అంశం తప్పుగా ఉంటే డాక్యుమెంట్ తీసుకొచ్చి సచివాలయంలో చూపిం చాలని కోరారు. అందుకు 15 రోజులు సమయం ఇచ్చారు. రికార్డులు వెరిఫికేషన్ చేయించుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జనవరి 5 వతేది వరకు సమయం ఇచ్చారు. అప్పటిలోపు వెరిఫికేషన్ పత్రాలు ఇస్తే పింఛన్ కొనసాగిస్తారని, లేదంటే పింఛన్ నిలుపుదల చేస్తారు. ఈ నిర్ణయంతో ఒక్కసారిగా పింఛన్ దారులు ఆందోళన చెందుతున్నారు. ఎంఎల్‌ఎలు, వైసిపి నేతల చుట్టూ తిరుగుతున్నారు. అయ్యా మా పింఛన్ కట్ చేస్తున్నారంటూ ఆందోళన చెందుతున్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో సుమారు 4 వేల మంది పింఛన్‌దారులకు నోటీసులు జారీచేశారు. నెల్లూరు రూరల్‌లోనూ ఎక్కువ మంది ఉండడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కలిశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంటనే మున్సిపల్ కమిషన్ హరితకు ఫోన్‌చేసి సమస్యను వివరించారు. వెరిఫికేషన్ చేయించి, పింఛన్ కట్ కాకుండా చూడాలని కోరారు. పరిశీలిస్తామని, వెరిఫికేషన్‌చేయిస్తామని చెప్పినట్లు తెలిసింది. జిల్లాలోని అందరు ఎంఎల్‌ఎల పరిస్థితి ఇలానే ఉంది.

జనవరిలో అందరికీ పింఛన్..

సాంబశివారెడ్డి- పీడీ, డిఆర్‌డిఎ

ప్రభుత్వ నిబంధనల మేరకు నోటీసులు జారీచేశాం. ఎవరికీ పింఛన్ నిలుపుదల చేయడం లేదు. పాత నిబంధనలు మేరకు ఉన్న వారికి పింఛన్ కొనసాగుతోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వెరిఫికేషన్ చేస్తాం. ఈ నేపథ్యంలోనే నోటీసులు ఇచ్చాం. నిబంధనల మేరకు ఉంటే రికార్డులు సచివాయాల్లో చూపించాలి. జనవరి నెలలో ఎవరికీ పింఛన్ నిలుపుదల చేయడం లేదు. జనవరి 5వ తేది వరకు వెరిఫికేషన్‌కు అవకాశం ఇచ్చారు. ఒక వేళ నిబంధనల ప్రకారం లేకపోతే ఫిబ్రవరి నెలలో పింఛన్ నిలుపుదల చేస్తాం. ఇవి పాత నిబంధనలే.. కొత్తగా వచ్చినవి ఏమీ కాదు..



సాంబశివారెడ్డి- పీడీ, డిఆర్‌డిఎ

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని కుక్కల గుంట, మహాలక్ష్మి ఆలయం సమీపంలో పాపమ్మ అనే మూడేళ్ల చిన్నారి తల్లిదండ్రుల వద్ద నుంచి అదృశ్యమైంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. 3వ నగర పోలీసు స్టేషన్ అధికారుల వివరాల మేరకు బుచ్చిరెడ్డిపాళెం మండలం, కొండుగుంట ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం యాచన నిమిత్తం నగరానికి కొన్ని రోజుల కిందట వచ్చింది. పగటి సమ యంలో యాచన చేసి రాత్రి సమయంలో ఆప్రాంతంలోని దుకాణాల వద్ద నిద్రించేవారు. రోజులాగే శనివారం ఉదయం యాచన చేసుకొని రాత్రి సమయంలో తమ ముగ్గురు బిడ్డలతో నిద్రిస్తున్న సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మూడేళ్ల చిన్నారిని అపహరించారు. దీనిపై బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ అన్వర్ భాషా తెలిపారు. నగర డిఎస్‌పి హుటాహుటిన ఆ ప్రాంతనానికివెళ్లి కేసు దర్యాప్తును పర్యవేక్షించారు. సిసి కెమోరాల పుటేజీ పరిశీలిస్తున్నామని, ఇప్పటికే నింది తులను అదుపులోకి తీసుకొనేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశామని పోలీసులు తెలిపారు.

'విఎస్‌యు'లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -వెంకటాచలం : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఈనెల 27న స్పాట్ అడ్మిషన్లు 2022-23 నిర్వహిస్తారని విఎస్‌యుప్రిన్సిపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబిఎ, ఎంసిఎ, ఎంటిఎం, ఎంఎల్‌ఎస్ ప్రోగ్రాములకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.



కవి సమ్మేళనంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని డాక్టర్ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి స్వగృహంలో పెన్నా రచయితుల సంఘం ఆధ్వర్యంలో జమున స్మారక జాతీయ స్థాయి నానీల పురస్కారం, డాక్టర్ జయప్రద నవాల పురస్కార సభలో నానీల కవి సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 30 మంది కవులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పెళ్ళకూరు జయప్రద స్వామి రెడ్డి రచించిన వైద్య పరిజ్ఞానం ఇంట్లో ఆరోగ్యం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మెట్టు రామచంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా, కాళిదాసు పురుషోత్తం పుస్తకావిష్కరణ చేశారు. ప్రముఖ కవి మోపూరు పెంచల నరసింహ మొదటి ప్రతిని స్వీకరించారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతతోపాటు సమన్వయకర్త అధ్యక్షులు అవ్వారు శ్రీధర్ బాబు వ్యవహరించారు. నవలా పురస్కారం గ్రహీత ప్రభాకర్ జానీ అమ్మ నానీల రచయిత పుచ్చకాయల పుచ్చకాయల బ్రహ్మోజీరావు సత్కరించారు. హీరోనవలను శిరం శెట్టి కాంతారావు ,అమ్మ నానీలను కొండ్రెడ్డి వెంకటే శ్వర్ రెడ్డి సమీక్ష చేశారు. గోవిందరాజు సుబద్రాదేవి , కోసూరు రత్నం , పెరుగు రామకష్ణ , చిన్ని నారాయణ రావు, ఈతకోట సుబ్బారావు , పాతూరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 11వ డివిజన్ పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్ ప్రాంతంలో అనారోగ్యంతో బాదపడుతున్న ఓ పాపను, వారి కుటుంబ సభ్యులను జనసేన నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుజయ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ పరిధిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా మేము జనసేన నాయకులు వారికి అందుబాటులో ఉంటామన్నారు. బాధిత కుటుంబానికి భవిష్యత్తులో కూడా తోడుగా నిలుస్తామని,ప్రభుత్వ అధికారుల దష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం దిశగా పోరాడుతామన్నారు. 11వ డివిజన్ కమిటీ అధ్యక్షులు దాసరి వెంకటరమణ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు ఏ సమస్య వచ్చిన ఎంతవరకైనా పోరాడుతామన్నారు. సమస్యను నగర అధ్యక్షులు సుజాబాబు దష్టికి తీసుకొనివెళ్లగా తక్షణం స్పందించిన నగర అధ్యక్షులు వారికి కతజ్ఞతలు తెలిపారు. నగర కార్యదర్శి దాసరి మాధురి, మహిళా విభాగం సభ్యురాలు కొండ శాంతి, 11వ డివిజన్ ఉపాధ్యక్షులు రామిశెట్టి సుధాకర్, డి. సత్య, ప్రధాన కార్యదర్శి, కొండ మన బాబు, ప్రభు కుమార్, సంయుక్త కార్యదర్శి, రాంబాబు, అజయ్ కుమార్, సభ్యులు, పండు, నవీన్, గని పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :జిల్లాలో గౌడ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దష్టి సారిస్తానని జై గౌడ్ జిల్లా ఉద్యమం అధ్యక్షులు మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని వరిగొండ గ్రామంలో ఆదివారం 2023 జై గౌడ్ క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. స్థానిక జై గౌడ్ నాయకులు ఉప్పల కిషోర్ గౌడ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి సుబ్రహ్మణ్యం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో గౌడ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కషి చేస్తానని సుబ్రహ్మణ్యం గౌడ్ తెలిపారు. అనంతరం గ్రామంలోని పసిడి పుట్టాలమ్మ అమ్మవారి గుడిలో సుబ్రహ్మణ్యం గౌడ్ జై గౌడ్ క్యాలండర్ ను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు మన్నెం పుట్టయ్య గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి అన్నభత్తిన కష్ణ గౌడ్, సర్వేపల్లి అధ్యక్షులు ఉప్పల పరమేశ్వర్ గౌడ్, సర్వేపల్లి యువత అధ్యక్షులు వేణుగోపాల్ గౌడ్, చల్ల రమేష్ గౌడ్, నిమ్మల రమేష్ గౌడ్, కోమరి కిషోర్ గౌడ్, వంశీ గౌడ్, నడవల అశోక్ గౌడ్, శివ గౌడ్, అశోక్ గౌడ్, ముని గౌడ్, సురేష్ గౌడ్,వెంకటేశ్వర్లు గౌడ్, నవీన్ గౌడ్ ఉన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సుబ్రహ్మణ్యం గౌడ్

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పొదలకూరు

పట్టణంలోని పంచాయతీ బస్టాండ్లలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో స్థానిక సేవా భారతి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. సేవా భారతీ కన్వీనర్ గంగవరపు. వేణుగోపాల్ రెడ్డి, బిజెపి నాయకులు భారత మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్ పాయ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠా యిలు పంచి పెట్టారు. వేమిరెడ్డి.హంస కుమార్ రెడ్డి, రాచపూటి. ధనుంజయరావు,దినేష్ చక్రవర్తి, రాజేష్,బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మధుసూదన్ రావు, క్రిష్ణ వేణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - లింగసముద్రం :లింగసముద్రం పంచాయితీలోని రామక్రిష్ణాపురం గ్రామంలో కషాయం తయారీపై అవగాహన కారక్రమాన్ని మీధా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్రాంత వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు.కషాయాలు తయారీ విధానాన్ని తెలియజేశారు. మీధా సంస్థ సభ్యులు నాగరాజు,వినోద్,సుధాకర్,రైతులు పాల్గొన్నారు.



సోమిరెడ్డిని సత్కరిస్తున్న మస్తానమ్మ

తెలుగు మహిళ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మస్తానమ్మ

ప్రజాశక్తి -పొదలకూరు

పట్టణానికి చెందిన మాజీ ఎంపిటిసి కొంగి.మస్తానమ్మ తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఆమె ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. తనను తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో తెలుగు మహిళ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమిం చడానికి చొరవ చూపిన మాజీ మంత్రి సోమిరెడ్డిని సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



కందుకూరులోని వైసిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి

ప్రజాశక్తి -కందుకూరు

స్థానిక వైసిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి కేకు కట్ చేసి క్రైస్తవ సోదరలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహీధర్ రెడ్డి మాట్లాడుతూ క్రీస్తు ప్రేమతత్వం అందరూ అలవర్చుకోవాలన్నారు. డిఎస్‌పి కండే శ్రీనివాసరావు ,న్యాయవాది ముప్పవరపు కిషోర్, వైయస్సార్ సిపి నాయకులు కోడూరి వసంతరావు, గణేషం గంగిరెడ్డి, గేరా మనోహర్, షేక్. రఫీ, చనమాల కోటేశ్వరరావు, గంగవరపు వెంకట్రావు, తిరుపతి రెడ్డి, తొట్టింపూడి శ్రీనివాసరావు, మూరారిశెట్టి శ్రీకాంత్, చీమల వెంకటరాజా, షేక్. రహీమ్, పిడికిటి శంకర్, రాజేష్ పాల్గొన్నారు.

ఉలవపాడు : ఉలవపాడులో ఆదివారం టౌన్ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘకాపరి గారైన దుగ్గిరల రత్న కుమార్ ఉపదేశం ఇచ్చారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు. వెలిచర్ల రత్నశేఖర్ దాదాపు రూ.40,000 విలువైన రిథం పాడ్‌ను బహూకరించారు.

వలేటివారిపాలెం : మండలం లోని అన్ని గ్రామాల్లో ఉన్న చర్చిల్లో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. క్రిస్టియన్లు చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. ప్రజలు అందరూ సుఖశాంతులతో ఉండాలని కాంక్షించారు. పోకూరు, వలేటివారిపాలెం, నేకునాం పురం, శాఖవరం, నలదలపూరు, శామీరపాలెం, కాకర్లపాలెం అన్ని గ్రామాల్లోనూ ప్రార్థనలను జరిగాయి. కాకర్లపాలెంలో టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు దివి శివరాం పాల్గొని కేక్‌ను కట్ చేశారు.



వలేటివారిపాలెం మండలం, కాకర్లపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు



ఉలవపాడులో..

వైసిపి పాలనలో దళితులకు అన్యాయం : సోమిరెడ్డి

ప్రజాశక్తి -పొదలకూరు

వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాలతోపాటు క్రిస్టియన్లకు తీరని నష్టం చేకూరిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జాన్ జాకబ్స్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కారించుకొని ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ప్రార్థన చేసి చర్చ్ ఫాదర్ పాల్ మహేంద్ర ఆశీర్వాదం తీసుకున్నారు. చర్చ్ లో కేక్ కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎస్‌సి కార్పొరేషనను నిర్వీర్యం చేశారన్నారు. ఎస్‌సి సబ్‌ప్లాన నిధులు దారిమళ్లించారని ధ్వజమెత్తారు. క్రైస్తవ సోదరులు ఆశీర్వాదం, ఐ.డీ.ప్రసాద్,మురళీ,చార్లీ ప్రకాశ్,మనోహర్, టిడిపి నాయకులు పొదలకూరు, తోటపల్లి గూడూరు మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, సురేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మల్లికార్జున్ నాయుడు,కోడూరు. భాస్కర్ రెడ్డి,అక్కెం సుధాకర్ రెడ్డి,బోగోలు భాస్కర్ రెడ్డి,పులిపాటి. వెంకటరత్నం నాయుడు,మద్దిరిళ్ళ. నరసింహులు యాదవ్,కొంగి.వెంకటరమణయ్య, జమీర్ , కలగట్ల. సందీప్, ప్రభాకర్,కొంగి మస్తానమ్మ, ఆదాల.సుగుణమ్మ ఖాదర్ బాషా పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న టిడిపి మహిళా నేతలు

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి...

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో కందుకూరు పట్టణ మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని 14, 26వ వార్డుల్లో మహిళా కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈనెల 28వ తేదీన కందుకూరులో జరిగే టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోడ్ షోకు అందరూ తరలిరావాలని కోరారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. పట్టణ మహిళా కమిటీ అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, నెల్లూరు పార్లమెంట్ మహిళా కార్యదర్శి బత్తిన ఆదెమ్మ, రావి సరిత, మల్లవరపు సీత, బి.దాక్షాయిని, చలంచర్ల పద్మ, పిడికిటి లక్ష్మి, పొడపాటి రాధ, అమ్మనుబోయిన వెంకటరత్నం, బక్కముంతల మమత, ఎస్తేరమ్మ, కామినేని అశ్విని, శ్రీదేవి, కాకుమాని విజయలక్ష్మి, కాకుమాని విజయ, కాకుమాని రాజ్యలక్ష్మి, 26వ వార్డు అధ్యక్షులు రత్తయ్య, కాకుమాని మాల్యాద్రి, కాకుమాని శ్రీనివాసులు, కాకుమాని విజయ, కాకుమాని రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, వేదికపై మాజీ ఎంఎల్‌ఎ దివి శివరాం

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి : టిడిపి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

ఈ నెల 28న కందుకూరు పట్టణంలో జరగనున్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు పర్యటనకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఆయనతో పాటు రాష్ట్ర పార్టీ కార్యనిర్వహణాధికారి, మాజీ శాసనసభ్యులు దివి శివరాం ఆదివారం మండలంలో పర్యటించారు. గ్రామాలకు వెళ్లి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశలు నిర్వహించారు. జనసమీకరణ చేయాలని సూచించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శివరాం మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మండల పార్టీ బాధ్యులు మాదాల లక్ష్మీ నరశింహం, కూనిపాలెం సర్పంచ్ నవులూరి రాజారమేష్, మాలకొండ దేవస్థాన మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, నాయకులు వలేటి నరశింహం, కాకుమాని ఆంజనేయులు, హర్ష, గట్టమనేని చెంచునాయుడు, సాదు చెన్నకేశవులు పాల్గొన్నారు.

వాయిజ్ వద్ద రూ.175 నాణెం



ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండలంలోని అనుమసముద్రం గ్రామంలో ఉన్న మన కరెన్సీ ప్రియుడు వాయిజ్ చేతికి మరో నూతన నాణ్యం వచ్చి చేరింది. ఆయన 30 ఏళ్లుగా కరెన్సీని సేకరిస్తున్నారు. కరెన్సీ ప్రియుడిగా పేరుగాంచిన వాయిజ్ కేంద్ర ప్రభుత్వం నుండి రూ.175 నూతన నాణెంను తెప్పించారు. భారత దేశంలోని అత్యున్నత యూనివర్సిటీ ఐఐటి రూర్కీ 175వ సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఈ నాణెంను కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేయగా ఈ రూ.175 విలువైన నాణెంను రూ.3850 ఖర్చు చేసి పోస్టల్ ద్వారా తెప్పించారు. దీంతో ఎన్నో విలువైన విదేశీ స్వదేశీ కరెన్సీ నోట్లు నాణేలను కలిగి ఉన్న వాయిజ్ వద్దకు మరో నూతన నాణెం చేరినట్లు అయింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఈ నాణెంను చూడటానికి గ్రామస్తులు మండల కేంద్రమైన ఎఎస్‌పేట చుట్టుపక్కల ప్రజలు ఇలా అనేకమంది ఆ నాణ్యంను చూడ్డానికి మన కరెన్సీ ప్రియుని దగ్గరకు వస్తున్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ కోచింగ్

ప్రజాశక్తి-కావలి

విక్రమ సింహపురి యూనివర్సిటీ బాస్కెట్ బాల్ జట్టుకు స్థానిక జవహర్ భారతి క్రీడా మైదానంలో 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఇచ్చిన కోచింగ్ ఆదివారం పూర్తియైందని కళాశాల పి.డి. పి.ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బాస్కెట్‌బాల్ అంతర్ విశ్వ విద్యాలయాల సౌత్‌జోన్ పోటీలు 27వ తేదీ నుండి చెన్నయ్ ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీలో జరుగనున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే కావలి జట్టుకు కోచ్‌గా జెబి జూనియర్ కళాశాల పి.డి.బ్రహ్మయ్య, మేనేజర్‌గా ఎస్. కె.జలీల్ బాషాలు వ్యవహరించి తర్ఫీదు ఇస్తున్నారన్నారు. జట్టుకు జె.బి.డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మన్నెపల్లి వెంకటేశ్వర్లు, యూనిఫారం అందజేసిన వారిని కోచింగ్ ముగింపు సందర్భంగా ప్రోత్సాహించారు.



కోచింగ్ పూర్తి చేసిన బాస్కెట్ బాల్ జట్టు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు : యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరూ శాంతి మార్గాన్ని అనుసరిస్తూ, శత్రువులను ప్రేమించే తత్వం కలిగి ఉండాలన్నారు. ప్రార్థనలకు వచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని విరువూరు గ్రామంలో సహా అన్ని గ్రామాల్లో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రంతా ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలో గడిపి క్రీస్తు యేసును కీర్తించారు. విరువూరులోని చర్చిలో ప్రార్థనలు గడిపి యేసు చరిత్ర నాటకంలో గెలుపొందిన వారికి పాస్టర్ బహుమతులు అందజేశారు.



ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని చర్చిల్లో శనివారం అర్ధరాత్రి నుండి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని కేకులు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నవంబర్ 25 నుండి ప్రీ క్రిస్మస్ వేడుకలు ప్రారంభం కాగా, డిసెంబర్ 25తో ముగిశాయి. ఆదివారం మధ్యాహ్నం పలు చర్చిల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు, పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు.

మంత్రికి మా సమస్యలు పట్టవా..!

- అల్లూరు రైతు ఆవేదన - యూరియా దారి మళ్లింపు - స్పందించని అధికారులు

ప్రజాశక్తి-అల్లూరు

రైతు ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా యూరియా కొరతతో అల్లాడుతుంటే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి సమస్య పట్టదా అంటూ అన్నదాతలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. యూరియా బస్తాను రూ.350 విక్రయిస్తూ ఉంటే ఇంతవరకు వ్యాపారస్తులపై వ్యవసాయ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. [illegible] నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. శ్రమను పెట్టుబడిగా పెట్టి ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేక ఎంతోమంది రైతులు దళారులు,డీలర్ల చేతిలో మోసపోయారని తెలిపారు. ఈ సమస్యపై కనీసం ఎంఎల్ఎలు మంత్రులు స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. ఇకనైనా ఎరువులు, పురుగుమందులను ఎంఆర్‌పి ధరలకు విక్రయించాలని రైతులు కోరుతున్నారు. అలాగే ప్రతి రైతుకు రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని రైతులు విన్నవిస్తున్నారు.

మైనారిటీల అభివృద్ధికి ఆవాజ్ పోరాటం

ప్రజాశక్తి ఆత్మకూర్ అర్బన్

ముస్లీం, మైనారిటీల అభివృద్ధి కోసం ఆవాజ్ నిరంతరం పోరాడుతుందని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌డి రఫీ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ బస్టాండ్ ప్రాంగణంలో ఆవాజ్ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌డి రఫీఅహ్మద్ సీనియర్ నాయకులు ఎస్‌ఎం బాషా జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ బస్టాండ్ నుండి సిపిఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల మహాసభ గౌరవ అధ్యక్షులు ఎం.నాగేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ అహ్మద్ మాట్లాడుతూ దేశంలో రెండవసారి బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లీం మైనార్టీలపై హిజాబ్ హలాల్, సమాజ్ అజాన్ లవ్ జిహాద్, గోమాంసం ఇలా అనేక రూపాలలో మతోన్మాద దాడులు పెరిగాయన్నారు. ముస్లిములు దాడికి గురవుతున్న ప్రతిసారి ఆవాజ్ ప్రతిఘటిస్తూ ముస్లిములకు అండగా నిలుస్తుందని తెలిపారు. మతం ఆధారంగా పౌరసత్వం అంటూ ముస్లిముల ఉనికిని ప్రమాదంలో పడేసే ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్, సిఎఎ లాంటి దుర్మార్గపు చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఆ సందర్భంలో రాష్ట్ర వ్యాప్తం గా వాటికి వ్యతిరేకంగా ముస్లిములను, నేతలను



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆవాజ్ నాయకులు

కూడా ఉద్యమంలో భాగం చేసిన లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదికలో ఆవాజ్ ముఖ్య పాత్ర పోషించిందని తెలి పారు. అంతే కాకుం డా దళితు లు మహిళలు గిరిజ నులు మానవ హక్కు ల కార్యకర్తలపై బిజెపి దాడులు చేసినప్పుడు ఆవాజ్ బాధితులకు అండగా ఉంటూ వచ్చిందన్నారు.



ప్రధాన కార్యదర్శిగా యస్థాని, అధ్యక్షులుగా అమీర్‌బాషా

ఆర్ఎస్ఎస్, బిజెపి తమ మతోన్మాత అజెండాను అమలు చేస్తూ దేశ సమైక్యతను సమగ్రతను ప్రమాదంలో పడేస్తున్న పరిస్థితుల్లో లౌకిక విలువలను కాపాడడం కోసం ఆవాజ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. నెల్లూరు జిల్లా సీనియర్ నాయ కులు ఎస్ ఎం బాషా మాట్లా డుతూ ఆవాజ్ మైనార్టీ అభివృద్ధి వేదిక 2002 నవం బర్ 29న ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో స్థాపించా రని తెలిపారు. గత రెండు దశాబ్దాలు గా మైనార్టీల అభివృద్ధి భద్రత, లౌకికవాద పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తుందన్నారు. జస్టిస్ సచార్ కమిటీ రంగనాథ మిశ్రా కమిటీల నివేదిక సారాంశం 75యేళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో సగటు ముస్లీం మైనార్టీ పరిస్థితి ఊఫర్ సే షేర్వానీ అందర్ సే పరేషానిగా ఉందన్నారు. ఈ కమిటీల సిఫార్సులను పాలక ప్రభుత్వాలు విమర్శించిన పరిస్థితుల్లో వాటి అమలు కోసం ఆవాస్ నిరంతరం కృషి చేసిందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు, వక్ఫ్‌బోర్డ్ ఆస్తులు పరిరక్షణ సబ్‌ప్లాన్ చట్టం దుల్హన్ పథకం 10శాతం మోసం ఇమామ్‌ల వేతనాల పెంపు అలా అనేక సమస్యల పై పోరాడుతూ మైనార్టీల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతుందని తెలిపారు. అనంతరం 21మందితో ఆవాజ్ నూతన కమిటీ ఎన్నికైంది. ఆత్మకూరు ఆవాజ్ మండలం ప్రధాన కార్యదర్శి పి.యస్థాని భాషా, అధ్యక్షులుగా షేక్ ఆమీర్ భాషా, కార్యవర్గ సభ్యులుగా పి.మస్తాన్, పి అజ్గర్, ఎస్.కె ఖాజా షరీఫ్, పి.హయత్ భాషా , షేర్ కాలేషా, షేక్ షబ్బీర్, షేక్ నాయబ్, షేక్ షరీఫ్, ఎస్‌డి అల్తాఫ్ , వసీమ్ అక్రమ్, కౌసర్‌లను ఏకగ్రీవ ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి యస్థాని బాషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లీం మైనార్టీలను చిన్నచూపు చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఆవాజ్ చేపట్టనున్న పోరాటాలను గురించి దళితులతో చర్చించి, వారితో కలిసి ఉద్యమాలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, మాజీ మున్సి పల్ వైస్ చైర్మన్ సంధాని, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, సిఐటియు మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగం, డివైఎఫ్ఐ నాయకులు నందా శీను, ముస్లీ, మెనారిటీ, తదితర నాయకులున్నారు.



మాట్లాడుతున్న ఎం.అజిత్‌బాబు

పిల్లలకు విద్యాసామగ్రి వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు వృత్తి రీత్యా బెంగుళూరులో నివాసముంటున్న సంయుక్త సేవాసంస్థ సభ్యులు ఎం.క్రిష్ణకిశోర్ - అనూష దంపతుల కుమారుడు ఎం.అశ్రత్ హయన్ పుట్టినరోజు సందర్భంగా సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బాలక్రిష్ణారెడ్డి నగర్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 60 మంది పేదపిల్లలకు నోట్‌బుక్స్, ప్రాడ్స్, స్టేషనరీ కిట్స్ వితరణ చేశారు. కావలి పట్టణం రూపాయ మిద్దె సెంటర్ వద్ద ఉన్న జ్యోతి టైలర్‌షాపు యజమాని జ్యోతి క్రిస్మస్ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో 40 మంది పేదపిల్లలకు బిర్యానీతో అన్నదానం చేసి కేకులు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, సంస్థ గౌరవ సభ్యులు ఎం.అజిత్ బాబు, నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, జ్యోతి, మంజు, సంస్థ అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని కేక్ కట్ చేసి అందరి పిల్లలకు ఇచ్చారు. ఈ సందర్భంగా గంధం ప్రసన్నాంజనేయులు, ఎం.అజిత్ బాబు మాట్లాడుతూ ఈనాటి దాత బెంగుళూరులో నివాసముంటున్నా స్వగ్రామమైన కావలిలోని పేద పిల్లలకు తన కుమారుడి పుట్టినరోజు పిల్లలకు విద్యాసామగ్రి అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు.



బిఎంఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు

బిఎంఆర్ దృష్టికి రైల్వే సమస్యలు

ప్రజాశక్తి బిట్రగుంట

బిట్రగుంట రైల్వే సమస్యలను పరిష్కరించాలం టూ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు దృష్టికి అభివృద్ధి కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. బిట్రగుంట రైల్వే ఆస్తులను సద్వినియోగం చేసుకునే విధంగా పార్లమెంట్లో తమ వాణిని వినిపించాల్సిందిగా బీదా మస్తాన్ రావును బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ తెలియజేశారు. ప్రపంచ వాకర్స్ దినోత్సవం పురస్కరించుకొని నెల్లూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావుకు బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు సభ్యులతో కలిసి నెల్లూరులోని కస్తూరిబా కళాక్షేత్రంలో బిట్రగుంట సమస్యలను బీద మస్తాన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన బీద మస్తాన్‌రావు తన వంతు సహాయ సహకారాలు బిట్రగుంట రైల్వే అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని హామీనిచ్చారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ ప్రతినిధి ఎ.కె.భాగ్యరాజ్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పిల్లి జీవన్, కుందుర్తి శ్రీనివాసులు, సత్యనారాయణ చార్యులు, కుందుర్తి బాపూజీ, విజయశేఖర్ తదితరులున్నారు.

వెన్నవాడ ఎఎన్‌ఎం మృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని వెన్నవాడ గ్రామ సచివాలయంలో ఎఎన్‌ఎంగా పని చేస్తున్న గంధం గీత ఆదివారం ఉదయం 9 గంటలకు తన స్వగృహంలో మృతి చెందారు. మృతురాలు గంధం గీత ఇటీవలే గుండె ఆపరేషన్ చేకిత్స చేసుకుంది. ఉదయం గుండె నొప్పి ఎక్కువై మృతి చెందినట్లుగా వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంపిడిఒ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఆమె మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ముందస్తు జాగ్రత్తలతోనే కోవిడ్ కట్టడి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు

గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలందరూ ముందస్తు జాగ్రత్తలతో కోవిడ్‌ను కట్టడి చేయగలరని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. ప్రముఖ దేశాలల్లో కోవిడ్ సరికొత్త వేరియంట్ బిఎఫ్-7 విజృంభిస్తుందని, ప్రతినిత్యం కరోనా కేసుల సంఖ్య గణనీయంగా నమోదు అవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అందులో భాగంగా మన దేశానికి చెందిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువు కోసం, పెద్దవారు ఉద్యోగాల కోసం పండుగల పేరుతో తమ సొంత ప్రాంతాలకు వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎటువంటి జాగ్రత్తలు తీసుకుందో ఆయన మాటల్లో..

ప్రశ్న. కోవిడ్ సరికొత్త వేరియంట్ బిఎఫ్-7 తీవ్రతతో ప్రముఖ దేశాలు ఇప్పటికే విలవిలలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో కోవిడ్ సరికొత్త వేరియంట్‌ను కట్టడి చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుంది..?

జవాబు. జపాన్, దక్షిణ కొరియా, బ్రెజిల్, అమెరికా వంటి దేశాలల్లో కరోనా సరికొత్త వేరియంట్ విజృంభిస్తుంది. జాగ్రత్తగా ఉండాలని రాష్ట్రాలను కేంద్రం హెచ్చరికలు చేస్తుంది. ప్రతినిత్యం పాజిటివ్ కేసుల నమూనాలను జినోమ్ సీక్వెన్సింగ్‌కు విధిగా పంపించాలని సూచించింది. నమూనాలను పంపించడం వల్ల పరీక్షలు చేసి కొత్త వేరియంట్ ఏమైనా ఉందా అన్నది గుర్తించ వచ్చు. అందుకు అనుగుణంగా చికిత్సలు ప్రారంభించి అనర్థాలను అధిగ మించడం సాధ్యమౌతుంది. గత అనుభ వాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలను చైతన్యం చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే కట్టడి చేయడం సులభతరం అవుతుంది. టెస్టు.. ట్రాక్.. ట్రీట్.. వ్యాక్సినేషన్.. కట్టడి అనే ఐదు అంచల వ్యూహంతో వ్యాప్తిని సమర్థంగా నియంత్రణ చేయలగలమని సూచించిందన్నారు. జిల్లాలోని 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, 29 పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రాపిడ్ కిట్లను ఇప్పటికే పంపిణీ చేశాం. ఒకొక్క ఆరోగ్య కేంద్రానికి 50 చోప్పున ఈ కోవిడ్ రాపిడ్ కిట్లను పంపిణీ చేయడమే కాకుండా విధిగా ప్రతినిత్యం ముగ్గురుకి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచనలు చేశాం.

ప్రశ్న. జిల్లాలో కోవిడ్ సరికొత్త వేరియంట్ బిఎఫ్-7 బాధితులను గుర్తించినట్లు సోషల్ మీడియాలో కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజమేనా...?

జవాబు. జిల్లాలో కోవిడ్ సరికొత్త వేరియంట్ బిఎఫ్-7 కేసు నమోదు అయిందంటూ సోషల్‌మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తవం. ఇతర దేశాల నుంచి జిల్లాకు వస్తున్న వారి సమాచారం ప్రతి నిత్యం విమానాశ్రయాలను నుంచి సేకరించి వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాం. వాస్తవానికి కృష్ణపట్నం పోర్టు సమీపంలో ఉన్న ఓ పరిశ్రమ క్రిస్మస్‌కు సెలవు ఇవ్వలేదన్న కారణంగా అక్కడ పనిచేస్తున్న కొందరు తప్పుడు ప్రచారం చేశారు. ప్రజలను భయాం దోళనలకు గురిచేసే తప్పుడు కథనా లు ప్రచారం చేసినా, ప్రోత్స హించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఆందోళన చెందాల్సి న అవసరం లేదు. గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.



ప్రశ్న. ప్రపంచాన్ని గడగడలా డిస్తున్న ఈ మహమ్మారిని కట్టడి చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలి. జిల్లా ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమైనా ఉన్నాయా..?

జవాబు. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏదైనా అనుమానం వస్తే దగ్గలోని ప్రభుత్వ వైద్యశాలను, ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యుల సలహాలు, సూచనలు తీసుకొని పాటించాలి. ప్రతిఒక్కరూ గతంలో ఏ విధంగా మాస్కులు ధరించారో అదే తరహాలో ఎన్-95, డబుల్ మాస్కులను ధరించాలి. భౌతికదూరం విధిగా పాటించాలి. శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలి. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు రద్దీగా ఉన్న ప్రదేశాలలో వీలైనంత వరకు సంచరించకూడదు. ఇంటి నుంచి బయటకు రాకపోవడం శ్రేయస్కరం. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ అవగా హన కలిగి ఉండాలి. అనుమానం వస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి.

భూ కబ్జాదారుల ఆగడాలు

ప్రజాశక్తి మర్రిపాడు

మండలంలోని భీమవరంలో భూకబ్జాదారులకు అడ్డు అదుపు లేకుండా పోయిందని బాధితులు వాపోయారు. ఈ మేరకు వారు ఆదివారం మాట్లాడుతూ ఎగువూరు రజకులకు చాలా ఏళ్ల క్రితం ప్రభుత్వం 617సర్వే నెంబర్‌లో 16మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసిందన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ నేత అక్రమ మార్గంలో 4.90ఎకరాలు కంప్యూటర్ అడంగల్‌లో తమ పేరును నమోదు చేసుకున్నారని తెలిపారు. తెలుసుకున్న లబ్ధిదారులు తహశీల్దార్‌కు తమ దగ్గర ఉన్న పాసు పుస్తకాలు, డీ ఫారాలు చూపించి వినతి పత్రం అందజేశారన్నారు. స్పందించిన రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించి కబ్జాదారునికి సంబంధించి ఉన్న పత్రాలను 10రోజులలో తీసుకురావాలని తహశీల్దార్ అదేశించారన్నారు. లబ్ధిదారులుగా తాము నెల సమయం ఇచ్చామని తెలిపారు. అయినా కబ్జాదారుని నుండి స్పందన లేకపోవడంతో రైతులు తహశీల్దార్‌ను కలువగా పంటలు వేసుకోమన్నారని తెలిపారు. పొలంలో జామాయిల్ మొక్కలు నాటుతుండగా మాపొలం అంటూ తమపై దౌర్జన్యం చేసి నాటిన మొక్కలను పీకేశారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.



మాట్లాడుతున్న బాధితులు

వికలాంగులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కావలి పట్టణ వెంగళరావు నగర్‌లోని విశ్వశాంతి పాఠశాలలో 50 మంది వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం హ్యాపీ సేవాసంస్థ గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్‌బాషా, వారి సతీమణి చాన్‌బేగం 48వ పెళ్లి రోజు సందర్భంగా వికలాంగులకు దుప్పట్లు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి 1వ పట్టణ ఎస్.ఐ. షేక్.జమాల్ వలీ దుప్పట్లు అందించి వారు మాట్లాడుతూ ప్రార్థించే పెదవులకన్నా-సాయం చేసే చేతులు మిన్నా అని హ్యాపీ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్.ఘనీబాషా చేస్తున్న సేవలను కొనియాడారు. బి.సి.హాస్టల్ వార్డెన్‌గా పనిచేసి, ఎందరో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పించిన మహనీయుడు ఖాదర్ బాషా అని తెలిపారు. వారు ఇప్పటికీ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ అందరిని ఆదుకోవడం ఎంతో అభినందనీయని, వారిరువురు నిండునూరేళ్ల సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లాలన్నారు. హ్యాపీ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్. ఘనీబాషా, సంస్థ గౌరవ సలహాదారులు సిరాజ్ మొగల్, పులగం.రామారావు, చేవూరి.ప్రభాకర్, (ఎస్) యూత్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఎం.వి.ఎన్. ప్రసాద్‌రావు, సామజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, కుమ్మరిగుంట.అనిల్, సంస్థ ఉపాధ్యక్షుడు దేవరకొండ.విజయ్, జాయింట్ సెక్రెటరీ మారుబోయిన.నాగరాజు, కార్యదర్శి అంచిపాక.హజరతయ్య పాల్గొన్నారు.





ఆత్మకూరులో 'మంచి మాట'

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించిన మంచిమాట కార్యక్రమం పట్టణంలోని మేధా స్కూల్‌లో నిర్వహించారు. ఈనాటి కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కొల్లా వెంకటేశ్వర్లు తరిగిపోయిన జానపద కళారూపాలు పరిచయం చేస్తూ, తమ ప్రసంగంతో ఆహూతులను ఆనందపరిచారు. బుర్రకథలు, హరికథలు, జడ కోలాటాలు, డుడు బసవన్నలు, పండరి భజన, చెక్క భజన లాంటి ఎన్నో కళారూపాలను తమ ఉపన్యాసంలో ప్రస్తావించారు. కార్యక్రమానికి ఎ.గోవింద రెడ్డి అధ్యక్షత వహించగా, గౌరవాధ్యక్షులు ఎస్‌వి రమణయ్య, కార్యదర్శి ఒ.శ్రీనివాసరాజు, టి.వెంకటసుబ్బయ్య, కోశాధికారి ఓమ్మిన సుబ్రమణ్యం, సోమవరపు యానాదిరెడ్డి, సుబ్బరాయుడు, రాఘవేంద్ర రావు, మల్లిఖార్జున, తెలుగు భారతి సేవాసమితి కార్యవర్గ సభ్యులు, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో 'భీమవరం'

సర్పంచ్ చెన్నమ్మ పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




శ్మశానికి వెళ్లేరోడ్డు

ప్రజాశక్తి-మర్రిపాడు

గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుంది. సర్పంచ్ చెన్నమ్మ పనితీరుతో మండలంలోని భీమవరం గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తూ ఆదర్శ గ్రామ పంచాయతీ దిశగా అడుగులు వేస్తోంది. ఎన్నికైన సర్పంచ్ ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులనూ వెచ్చించి పంచాయతీని అగ్రగామిగా నిలబెడుతున్నారు. రాజకీయాలకతీతంగా పని చేస్తూ సర్పంచ్ పదవికే వన్నె తెస్తుందని గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారు. గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లను నియమించి పారిశుధ్య పనులను పక్కాగా నిర్వహిస్తున్నారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే గ్రామంలో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ, మండలంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా తన వంతు కృషి చేస్తున్నారు. పంచాయతీలో అపరిష్కృతంగా ఉన్న పంట కాలువలను ఎఫ్‌డిఆర్ నిధులతో పనులు పూర్తిచేసి చివరి ఆయకట్టుకు నీరందించారు. పంటల సమయంలో రైతులు మాగాణిలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండగా గ్రావెల్ రోడ్డును వేసి సమస్యను పరిష్కరించారు. ఎగువూరులో శ్మశానానికి,



పంటకాలువలు



డ్రైయినేజీ కాలువలు

ఎస్‌సిల శ్మశానానికి వెళ్లే రహదారి వెంట ఉన్న కంప చెట్లను తొలగించి రోడ్డు వేశారు. పంచాయతీలో కోటి 20లక్షల రూపాయలతో సిసి రోడ్లు, తమ స్వంత నిధులు వెచ్చించి, డ్రెయినేజీలు ఏర్పాటు చేసి మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పాల కేంద్రం నిర్మాణ దశలో ఉండగా త్వరలో పూర్తి చేస్తామన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా పనిచేయని మూడు మోటార్లను బాగుచేయించి బొగ్గేరు నుండి నీటిని సరఫరాను పునరుద్ధరించారు. అలాగే ఎస్‌సి కాలనీ చుట్టూ అడవిని తలపించేలా ఉన్న కంపచెట్లను, ఎప్పటి నుండో ఎవరూ పరిష్కరించని కాలనీ రోడ్డును స్వంత నిధులతో సిసిరోడ్లు వేశారు. వాటర్ షెడ్డు, మరమ్మతులు చేసి కొత్త మోటారు బిగించి నీటి సమస్య పరిష్కరించారు. దేవాలయం మరమ్మతులు, అరుగు నిర్మాణం పూర్తి చేశారు. కుటుంబంలో ఎవరైనా మరణించిన కర్మకాండలకు రూ.20వేలు అందించడమే కాకుండా అనారోగ్యంతో ఉన్నవారికి ఆసుపత్రి ఖర్చులు భరించేవారు. 30ఎస్‌సి కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఉచిత రేషన్ బియ్యానికి సంవత్సరం పొడవునా అయ్యే ఖర్చును, పంచాయతీలో ప్రజలందరరికీ ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తున్నారు. ప్రతి ఏడాది క్రిస్మస్ సందర్భంగా పాస్టర్లకు ఆర్థికసాయం అందిస్తుంటారు. పేదల ఇళ్ల మరమ్మతులకు సిమెంట్ ఉచితంగా అందజేశారు. బిసి కాలనీలో కొత్తగా కరెంట్ లైన్, పొలాల్లో ఒరిగిన స్థంభాలను సరిచేయడానికి రూ.50వేల సొంత నిధులు, కాలనీలో 15స్థంభాలు, వైరుకు నిధులిచ్చామన్నారు. గ్రామస్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నారని, ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న పనులను పరిష్కరిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు.



నాయకులతో మాట్లాడుతున్న వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం

వైసిపి నాయకులతో ఆనం సమావేశం

ప్రజాశక్తి-మర్రిపాడు

మర్రిపాడు, అనంతసాగరం మండలాల వైసిపి నాయకులతో వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. నెల్లూరు నుండి బద్వేల్ వెళ్తూ నారాయణ గెస్ట్ హౌస్‌లో అల్పాహారానికి ఆగిన సమయంలో, సమాచారం అందుకున్న మర్రిపాడు, అనంతసాగరం వైసిపి నాయకులు వచ్చి ఆయనతో సమావేశమయ్యారు. నాయకులను పేరుపేరునా ఎంఎల్‌ఎ పలుకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల తుపాన్ ప్రభావంతో వర్షాలు విస్తారంగా పడినందున పొగాకు, పంటఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. నేతలు పలు సమస్యలను ఎంఎల్‌ఎకు వివరించారు. అప్పుడప్పుడు వస్తూ నాయకులతో సమావేశం కావడంతో చర్చనీయాంశంగా మారింది. వికలాంగుడు శ్రీనివాసులురెడ్డి తన ఆరాధ్య దైవమైన ఆనంకు పుష్పగుచ్ఛం ఇచ్చి క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.